కథానిక

శ్రీ వాకాటి పాండురంగారావ్

# వసుంధర

*జీవన స్రవంతిలో కలసి ప్రవహించవలసిన రెండుపాయలూ వేరు వేరు పాయలను కలుపుకుని ప్రవహించాయి. మధ్యలో కలిసిన రెండు పాయలూ మధ్యలోనే హరించిపోయాయి. కలసి ప్రవహించ వలసిన రెండు పాయలను తిరిగి కలిసి ప్రవహించేట్టు చేసారు రచయిత.*

వసుంధర వెళ్ళి నిల్చుంది- ఆకాశం క్రింద. అమ్మ ప్రేమలా ఆవరించి వుంది ఆకాశం.

నల్లటిపిల్ల నవ్వినట్లుగా వున్నాయి నక్షత్రాలు.

ఠాణాలో ఒంటిగంట కొట్టారు.

ఆ నిశీధిలో, ఆ నిశ్శబ్దంలో నింగిక్రింద నిల్చున్న వసుంధర మనసు ఒకక్షణం ప్రళయ ఘోషచేసి మరుక్షణం ఆ విశాలమయిన నిశ్శబ్దంలో ఒక అణువుగా నిలిచింది.

అలా ఎంత సేపయిందో!

తాను ఆనుకుని నిల్చున్న కిటికీ ఊచలు మరీ చల్లగా వున్నాయనిపిస్తే, చేతులు తీసి చూచుకుంది. తడిగా వున్నాయి. ఇందాక ఆయన తాగకుండా విసిరేసినమందు కాబోలు కిటికీ ఊచలమీద పడ్డట్లుంది.

ఆయన!

పెద్దగా నిట్టూర్చి దొడ్డివైపునుండి గదిలోకి నడిచింది వసుంధర. స్టూలుమీది గుడ్డిదీపం జాలిగా చూస్తూంది. నులక మంచానికి అతుక్కుని నిద్రపోతున్నాడు కేశవరావు...క్రింద, చాపమీద- మాసిన తలగడని పక్కకుతోసేసి బోర్లపడుకుని నిద్రపోతూంది ఉమ... దాని కాళ్ళు నేలమీదకున్నాయి. వాటిని చాపమీదకులాగి, తలగడ సరిచేసి ఉమను పడుకోబెట్టింది వసుంధర. ఉమమొహంమీదకు పడివున్న ముంగురులను వెనక్కు తోసింది.

కేశవరావు మూలిగాడు నిద్రలో.

లేచివెళ్ళి ప్రక్కను నిల్చుంది వసుంధర. వంగి, అతడిమీదికి దుప్పటిని లాగింది. అతడి పెదవు లేదో గొణుగుతున్నాయి.

ఆ పెదవులే... ఆ పెదవులే... మూడు గంటలక్రింద అన్న మాటలు వసుంధరలో ప్రళయాన్ని వర్షించాయి.

"నాకు తెలుసు... ఆ రమణకోసం... నువ్వు ఎదురుచూడ్డం-"

తన్ను ఆ మాటలతో పొడిచారు ఆయన. తన్ను ఆయన ఆ మాటలన్నారు. ఈ నిప్పు ఆ మనసులో ఎప్పటినుండి రగులుతోందో!...

అసలు ఆసాయంకాలం – వున్నట్లుండి జ్వరం ఎక్కువయింది కేశవరావుకు.

అంతజ్వరంలో – "వసూ" అని పిలిచాడు కేశవరావు. వసారాలో గంజి కాస్తున్న మనిషల్లా ఆపళంగా లేచి వచ్చింది వసుంధర.

"నా పెట్టి అడుగున...ఓచిన్న అట్టపెట్టి వుంది. తీసివ్వు—" అన్నాడు.

తీసిచ్చింది.

"నువ్వెళ్ళి పనిచూచుకో—" అన్నాడు.

వెళ్ళింది.

కాస్సేపు తర్వాత ఆమె గదిలోకి వస్తే చేతిలో ఏదో వుంచుకుని దీక్షగా చూస్తున్నాడు కేశవరావు.

"మీరు అలసట కూడదండీ—" అంటూ వసుంధర మంచం దగ్గరకి వెళ్ళగానే ఒక్కసారి విసిరినంత పనిచేసి, చేతిలోని దాన్ని దాచుకోబోయి ఆపని చెయ్యలేక దాన్ని జారవిడిచి —"నిన్నెవడు రమ్మన్నాడిప్పుడు? —ఎందుకొచ్చావు నువ్వు? —ఆ ఫోటో సెందుకు చూశావు?—" అని అరిచాడు కేశవరావు.

"ఫోటోనా!?" — అని అతడిచేతిలో ఇంతసేపున్నది ఫోటో అని మొదటిసారిగా తెలుసుకుని, క్రిందపడిన దానిని తీసి అతడిచేతి కిచ్చింది వసుంధర.

దాన్ని చాల మొరటుగా లాక్కుని— "నిన్నెవడు తియమన్నాడు? ఎందుకు ముట్టుకున్నావు—" అని అరిచాడు కేశవరావు.

"ఆయాస పడకండి, దగ్గొస్తుంది—"

"అవునవును, వస్తుంది. దగ్గొస్తుంది... నాకు తెలుసు....నన్నిలా అరిపించి అరిపించి పంపించేస్తావు నువ్వు.... నీ యత్నం అదే... నాకు తెలుసు—"

"ఏం మాటలండీ అవి..." అని అతడి గుండెమీద రుద్దబోయింది వసుంధర.

"చాలు నీ రక్షణ...నన్నొక మనిషిక్రింద బ్రతకనివ్వలేదు నువ్వు—"

"...ఇదుగో మందు— పుచ్చుకోండి—"

మన్...దు...!...హూ—!" —అని మందు గ్లాసుని కిటికీవైపు విసిరికొట్టాడు కేశవరావు. శక్తి వుడిగిపోయిన అతడి శరీరం ఆ మాత్రం ప్రయత్నానికే అలిసిపోయింది. గట్టిగా రొప్పుతూ పడుకున్నాడు. వసుంధర దగ్గరకు రాబోతే విసిరి కొట్టినంత పని చేశాడు. ఇంక ఆ ధోరణి మారేక తానేం చేసినా అతడు అనవసరంగా అలసిపోతాడని మారు మాటాడక బయటికి నడిచింది వసుంధర. ఆగది గుమ్మం దాటుతుండగా ఆమెచెవిలోకి దూసుకొచ్చాయి ఆమాటలు...

—"ఎందుకు ఈ వంచన—ఎందుకు ఇవన్నీ వెళ్ళిపో హాయిగా వెళ్ళిపో..! నాకు తెలుసు ఆ రమణ కోసం నువ్వు ఎదురు చూడ్డం...."

గిరుక్కున గది లోపలికి తిరగటంలో చేతి గాజొకటి తలుపుకు తగిలి పగిలింది. ఒక్క నిముషం అతడిని చూచింది ఆమె. ఆమె మణికట్టు మీది నెత్తురు మరక నల్లపడనారంభించింది.

ఎనిమిదేళ్ళ జీవితాన్ని నడిపించిన నమ్మకం— తనలోని, తనకే తెలియని ప్రాణంలాంటి జీవన సూత్రం——

——ముక్కలు ముక్కలయినట్లు

——ఒక్కసారిగా పర్వతాలు విరుచుకు పడ్డట్లు

——విలయ తాండవం చేసినట్లు అయింది

కిటికీగుండా మందంగా ప్రవేశిస్తున్న సాయంకాలపు ఎండకు ఇవతల ఎముకల పుట్టగా పడుకున్న కేశవరావు... ఆమె మొహం చూడక పైకప్పుమీదకు చూస్తున్నాడు. నులక మంచంమీద అతడి పక్కగా వుంది ఆఫోటో.

ఆమె దొడ్డివైపు వెళ్ళింది.

నంది వర్ధనశెట్టు నక్షత్రాలను మోస్తున్నది కోరిక చాచిన చేతుల్లా పడమట సూర్యుడి కిరణాలు ఆకాశాన్న వెతుకుతున్నాయి.

కొంతసేపు తర్వాత కేశవరావు దగ్గాడు. లోపలికి వెళ్దామనుకుంది వసుంధర. సగ్గు ఆగింది. ఆమె కాళ్ళు కదలలేదు.

అరగంట తర్వాత ఉమ వచ్చింది. ఆట లాడి వచ్చింది: వీధిలోని మట్టి అంతా దాని మీదే వుంది. అది ఏదో అడిగింది. అమ్మ పట్టించుకోకపోతే అది మళ్ళీ వీధిలోకి వెళ్ళింది. అప్పుడు ఆరయిందేమో గంట...

చీకటి పలకరిస్తే లేచి లోపలికివెళ్ళి దీపం వెల్గించింది వసుంధర. కాస్సేపు తర్వాత ఉమకు అన్నం పెట్టింది. కేశవరావుకు ఇంకో గ్లాసులో మందు, పాలుకలిపిన గంజి, కాల్చిన రొట్టెముక్కలు, వేడినీళ్ళు పట్టుకెళ్ళి ఇచ్చింది.

అతను మాట్లాడకుండా పుచ్చుకున్నాడు. ఆమె అతడిని చూడలేక పోయింది ..

అన్నంముందు కూచుంటే తినబుద్ధి కాలేదు వసుంధరకు. చేతులు కడుక్కుని వెళ్ళి ఉమ ప్రక్కగా చాపమీద పడుకుంది. గంట తొమ్మిది దాటింది.

అలా చాపమీద పడుకోవడం మొదలయి ఆరేళ్ళు దాటింది. నిద్రలో ఉమ అమ్మమీదకు కాలువేసింది. దాన్ని తీసి పక్కకు పెట్టింది వసుంధర. ఉమ పాదం మీద మట్టి బెడ్డ కాబోలు, చేతికి తగిలితే తీసిపారేసి చెయ్యి తుడుచుకుంది... ఉమకు మొన్న సంక్రాంతికి ఐదు వెళ్ళి ఆరో ఏడు వచ్చింది దాని పుట్టిన రోజుకు రమణ చిన్న వుంగరం పంపాడు... రమణ...!

చిన్నప్పుడు - కోటప్పల్లాములో అత్తయ్య ఇంట్లో తాను పెరుగుతుండగా - రాత్రిళ్ళు రమణనీ తన్నూ, ఇద్దరినీ చెరోప్రక్కా పడుకో బెట్టుకుని కథలు చెప్పేవాడు మామయ్య. రమణంటే ప్రక్కింటి కోమలమ్మగారి అబ్బాయి. మామయ్యకు పిల్లలు లేరు ...రమణ చెట్టెక్కి తనకు చింత కాయలు కోసిచ్చేవాడు...ఒకసారి వినాయకుడి గుంటలో కలువపువ్వు కోసం తాను నీళ్ళల్లోకి దిగివెళ్ళి బురదలో కాలేసి, జారిపడి కొట్టుకులాడుతుంటే రమణ వచ్చి బయటకు తీసుకొచ్చాడు...అప్పుడు తనకెంత, ఆరేళ్ళుంటాయేమో; రమణా తన ఈడు వాడే...

ఆ తర్వాత మామయ్యకు అవనిగడ్డకు బదిలీ వస్తే తానూ అక్కడే పెరిగింది. అమ్మ చిన్నప్పుడే పోయింది. నాన్న రెండో పెళ్ళి!, ఎవరో మళయాళం అవిడను చేసుకుని ఆదేశంలోనే వుండిపోయాడు... ఇప్పుడూ వున్నాట్ట! ఉత్తరమయినా రాయడు. ఆయనొక తండ్రి! తానొక కూతురూ!... తన్ను ఎస్. ఎస్. ఎల్. సి దాక చదివించాడు మామయ్య... తన పదిహేనో ఏట బందరులో ఎవరింటికో అత్తయ్యతోబాటు వెళ్ళినప్పుడు చూసింది కేశవరావుని.

పొడుగు మొహం... సన్నటి మనిషి... తరచిచూసే కళ్ళు... అందమయిన వాడు కాదు. కాని, కాని తనలో ఏదో... కదిలింది. ఇతడు... కాదు కాదు... ఈయన ఎందుకో బాధపడుతున్నట్లున్నారు ఏదో పోగొట్టుకున్నట్లున్నారు... ఎందుకలా దిగులుగా బాధగా చూడ్డం... ఆయన దిగులు తీర్చే వాళ్ళెవరూ లేరా? ఆయన కళ్ళల్లో మంద మందంగా వెలుగుతున్న ప్రాణాన్ని నిండుగా వెల్గించగల వాళ్ళెవరూ లేరా?- అనిపించింది. ఆయనా మామయ్య కేదో దూరపు బంధువుట.

ఆ తర్వాత ఆయన ఏదో పనిమీద అవనిగడ్డ వస్తూ వెళ్తూ వుండేవాడు. నాలుగు నెలల తర్వాత ఓ ఆదివారం ఆయన అవనిగడ్డ వచ్చారు.

ఆ రాత్రి... పదకొండు గాటిన గర్వా- తనకు నిద్ర పట్టక గాలికోసం, వంటింటి వెనక తలుపులు తీసి గోడకు చేరగిలబడి కూర్చుని వుండగా వచ్చారాయన హఠాత్తుగా. తాను లేచి నిలబడింది. "వసుంధరా! నువ్వు కావాలి నా జీవితానికి..." అని చేతులు పట్టుకో బోయారాయన. తాను విదిలించుకుని లోపలి కొచ్చేసింది. అపుడు గుండెలెలా కొట్టుకున్నాయనీ!

అప్పుడు రమణ ఏదో పెద్ద చదువులకని యూరపు వెళ్ళి వున్నాడు. ఉత్తరం వచ్చి ఏడాది అయింది.

రమణ——...ఈయన——...

రమణ తన్ను చూసి నాలుగేళ్ళయింది. రమణ ఎక్కడో దూరదేశానికి ఒంటరిగా వెళ్ళి వుండగల్గు తున్నాడు. ఈయనో...తను నాలుగు నెలల కింద దాక ఈయన్ని ఎరగదు. కాని ఈయన తన్ను విడిచి ఉండలేరు. ఆ విషయం తనకు తెలిసి చాలా రోజులయింది. ఈయనకు తను కావాలి. ఈయనను లాలించాలి. ఈయనను సంతోష పెట్టాలి ... మామయ్య అన్నీ కనుక్కుని మాట్లాడాడు. అత్తయ్య బంధువో కాదన వచ్చి ఈ కేశవరావు ఉత్త అనారోగ్యపు మనిషి, జాగ్రత్త అన్నాడు. అది తన నిర్ణయాన్నింకా స్పష్ట పరిచింది.

ఆ శ్రావణంలో ఒక ప్రాంతఃకాలాన తను శ్రీమతి కేశవరావ్ అయింది. తన జీవితానికో అవసరం ఏర్పడింది. తన బ్రతుకొక్క అర్థం కనపడింది. ఆనాటి సంతోషం ఎంత బరువనిపించిందో! ఆ రోజు బ్రతుకు ఎంత నిండుగా వుండిందో—!! తన పెళ్ళి శుభలేఖని అందుకున్న రమణ యూరపులో అదేదో వూరు— 'బెర్న్' కాబోలు, అక్కడినుండి ఒక గడియారం పంపాడు అలారం 'కీ' యిస్తే ఆ గడియారం ఎంతో ఇంపుగా మృదుమధురంగా రెండు నిముషాల సేపు పియానో మీద వినిపించినట్లు పాట వినిపిస్తుంది... అది పంపాడు రమణ.

ఉత్తరం కోసం ఆ పార్సిలంతా వెతికింది తను. కాని చిన్న అట్టముక్క మాత్రం కనపడింది. "ఈ గడియారంలో వినిపించే పాటలా 'వసు' జీవితం ఉండాలని కోరుతూ——రమణ" అని ఉంది దాని మీద.

(తరువాయి 33 వ పేజీ)

## వసుంధర

(8 వ పేజీ తరువాయి)

ఆ సాయంకాలం ... గి కొముపాలు తీరిక దొరికితే తాను ... రేడియోకి 'కీ' యిచ్చి పాట వింటూ కూచుంది. పాట మధ్యలో తన పేరు వినిపిస్తే కళ్ళు తెరిచింది. ఆయన కేశవ రావు...వచ్చారు "తల నొప్పిగా వుంది వసు" అంటూ. తనకు ఓ ప్రక్క భయమూ, సిగ్గు ఇంకో ప్రక్క సంతోషమూ గర్వమూ... ఆయన్ను పడుకోమని చెప్పి లోపలికి వెళ్ళింది ఎవరో ఎగతాళిగా ఏదో అన్నారు. కాని తనకు వినిపించితేగా. వెంటయ్యతో చెప్పి తలనెప్పి మాత్ర ఒకటి తెప్పించి, మంచి కాఫీ నే ఇంచి గ్లాసునిండా తీసుకెళ్ళి యిచ్చింది. అప్పుడు 'నీపేరు వసుంధర కాదు, అమృతం' అన్నారాయన ... ఆక్షణం ఎంత గొప్పది! అంత కాలమూ ఆ క్షణానికోసం బ్రతికి, ఆ క్షణాన చనిపోయినా తనకేమీ ఆక్షేపణ వుండదనిపించింది — ఆరోజు.

కాని... ఆ క్షణానికి కొన్ని కోట్ల క్షణాల తర్వాత ఈనాడు అది గుర్తుచేసు కుంటే తన్ను తాను గుర్తు పట్టటం కష్టమని పిస్తుంది... పెళ్ళయిన రెండో ఏడు ఉమ పుట్టడానికి కొన్ని వారాల ముందు రమణ పెళ్ళి పత్రికొచ్చింది. ఆ పెళ్ళికూతురు పేరు లలితట ఎవరో... అయినా తనేమి పంప గలదు. రమణకు ...ఈయన నెల జీతం తమ తిండికే చాలడం లేదు...అదీ కాక నెల చివరి రోజులు.... అప్పు కూడా పుట్టదు. ఏమీ తోచక చివరికి ఒక ఉత్తరం రాసింది రమణకు అది పోస్టు చేయమని ఆయనకిస్తే చదివారు.

చదివి— "నువ్వు ఎవరికో పుత్తరాలు రాయడం నాకిష్టం లేదు వసూ—" అన్నారు.

"ఎవరో కాదండీ మా రమణ! మా రమణ పెళ్ళి చేసుకుంటున్నాడండీ—" అని ఎంతో సంబరంగా చెప్పబోయింది తను.

"మీ రమణ" అని ఆయన అన్న ధోరణి తన్ను నిలువునా నరికినట్లయింది. ఒక్కసారి గా వేడివేడి మంటల మీద నుండి గాలి వీచి నట్లయింది.

తానా ఉత్తరాన్ని లాక్కుని చింపేసింది. అయిన పెళ్ళి పోయారు....

ఉమ పుట్టిన ఆరో నెల కల్లా ఆయన ఆరోగ్యం దారి తప్పింది.

మందులు— సెలవు— బలహీనం- చిరాకు .. ఇంకా మందులు— జీతంలేని సెలవు—లోం ఎక్స్‌రేలు, ఇంజక్షన్లు —ఉద్యోగానికి గా నామా— పూర్తిగా మారిపోయిన తత్వం .

ఇదీ రెండేళ్ళల్లో పరిస్థితి. తన పెళ్ళయి నాలుగేళ్ళు కూడా కాలేదు. కాని ఆయనకు ఇల్లు కదలకుండా విశ్రాంతినిచ్చి తనకు తెలిసిన చదువుతో ఇంటి దగ్గరే నాలుగు ట్యూషన్లు చెప్పి పత్రికలకేదో అదీ ఇదీ రాసి, అ అరవై డెబ్భై రూపాయలలో ఈ తొమ్మిది రూపా యల పెంకుటిల్లు అద్దెకు తీసుకుంది. ఇలా, ఈ మారుమూల గ్రామంలో తన జీవితం నడు స్తోంది — రెండున్నర సంవత్సరాల నుండి—

నాలుగు నెలల క్రింద ఒక రోజు ఎందుకో ఆయన బట్టల్ని సర్దుతుంటే చిన్న అట్టపెట్టె చినిగిన పంట్లాం మడతలో కన్పించింది. ఏమి టోనని దానిని తీసి చూస్తే- కళ్ళు తిరిగాయి. ఒక ఫోటోలో ఆయన, ఆయన చేతి చుట్టులో ఇంకెవరో అమ్మాయీ వున్నారు. తేలుని పడేసినట్లు దానిని కింద పడేసింది. ఆదర బాదరా అన్నీ సర్దేసింది.

అది ఎవరు? ఎవరయితేనేం- ఇంకోరుండగా ఈయన ఏరికోరి తన్నే పెళ్ళిచేసుకున్నా రెందుకు- తల్లిలేని పిల్ల అనా? జాలి తోనా?

ఆమె అతడిని ఏమీ అడగలేదు.

ఆ ఫోటోయే కాబోలు- అవును, సందేహం లేదు- దానినే ఇవాళ ఇందాక తీసిమ్మన్ని చూచుకున్నారాయన. దాన్ని తను ఇవాళ చూడనేలేదు. కాని ఆయన ఎందుకో కోప్ప డాలి. ఏవిటిదంతా- ఏవయితేనేం, ఆయన తన గుండెలో గుండెగా, కంటిలో పాపగా ఎవరిని కాపాడుతుందో- ఆయన, ఎందుకలా అన్నారు? రమణ పేరు ఎందుకెత్తారు?

మనసులో నిప్పుల వర్షం కురిసినట్లయితే పడుకోలేక లేచి కూచింది వసుంధర.

కేశవరావు నిద్రపోతున్నాడు. ఎడమబుగ్గ మీద చొంగ కారుతూంది. లేచి వెళ్ళి దుప్పటితో అది తుడిచింది. బయటికి నడి చింది.

గాణాలో ఒంటిగంట కొట్టారు.

వసుంధర వెళ్ళి నిల్చుంది ఆకాశంకేసి ఒంటరిగా.

◆ ◆ ◆

"ఏవిటో అంత బిగువు" అంది లలిత గదిలోకి ...వస్తూ..

"స్వీట్సండి ...." అన్నాడు రమణ ఆ పొట్లాన్ని టేబిల్ మీదవుంచి... ఆమె అతడికోటు నందుకుంది.

"నువ్వు పడుకో లలితా!" అన్నాడు రమణ కుర్చీమీద కూచుని షైముడి విప్పుతూ—

"పడకా పడకా పడకా! ఎప్పుడూ పడ కేనా—" అని విసుగు నటించి, నవ్వేసి అతడి పాదాల దగ్గర నేలమీద కూచుని బూట్ల దారాలు విప్పసాగింది లలిత.

పొట్లంలోని బాదుషా ఒకటి తుంచి ఆమె నోటి కందిచ్చించాడు రమణ.

పెదవులు ముడిచి మొహం అటు తిప్పే సింది లలిత. "అలా చేతులతో ఇచ్చేట్లయితే నాకేమీ అక్కర్లేదు."

నవ్వాడు రమణ

నవ్వింది లలిత

గంటసేపు కబుర్లూ చెప్పుకున్నాక డాబ్ రింటికి వెళ్ళింది లలిత. రమణ డాబామీద కెళ్ళి నిల్చున్నాడు.

ఆకాశంనిండా గాలిపటా లెగురుతున్నాయి మనుషుల మంచి ఆలోచనల్లాగా. గాలి పటాల దారాలని చూస్తూంటే మనుషుల స్వార్థం గుర్తు కొస్తూంది. గోడవారకెళ్ళి క్రిందకు చూశాడు రమణ. తమ ఇంటి ముందున్న చిన్నతోట ఇంకా చిన్నగా అందంగా కనబడింది. ముచ్చటగావున్న ఆకు పచ్చటి గడ్డినిచూస్తే పైనుండి దానిమీదకు దూకుదామనిపిస్తూంది. ఆమూల గేటుప్రక్కగా ముద్ద మందార పువ్వులు మూడో నాలుగో కొట్టొచ్చినట్లు కనిపించాయి.

మందార పువ్వులంటే వసూకెంత ఇష్టమో— అనుకున్నాడు రమణ.

'ఎరుపు రంగంటే నాకెంత ఇష్టమో' అనేది వసూ తన పెద్ద కళ్ళతో చూస్తూ. "నువ్వు కాళీదేవివి అందుకనే నీకా రంగు ఇష్టం" అని తాను ఉడికిలించేవాడు.

ఇవాళ– సెప్టెంబరు పదహారు– వసుంధర పుట్టినరోజు... ఇవాళ వసుకు ఇరవైరెండు నిండి ఇరవై ఎనిమిదో సంవత్సరం వస్తుంది... తను చెట్టెక్కి చింతకాయలుకోసి పడేస్తే ఏరుకుని పావడాలో మూటకట్టుకున్న పిల్లకు ఇరవై ఎనిమిదేళ్ళు! ఈనాడు ఆ అమ్మాయి ఒక ఇల్లాలు, ఆమె ఒక బిడ్డకు తల్లి!! కాలం ఎంత త్వరగా దొర్లిపోతుందో– వసు పెళ్ళికి తాను యూరపులో వున్నాడు. తన పెళ్ళికి ఆహ్వానం పంపాడుకాని ఉత్తరంకూడా రాలేదు. తర్వాత, వాళ్ళ అమ్మాయి పుట్టిం రోజుకు– రెండేళ్ళ క్రింద ఉంగరం పంపించాడు తను. ఆ పోస్టలు రశీదుమీద వసు సంతకం వుంది అంతే! మొన్న సంక్రాంతికి వాళ్ళమ్మాయికి గౌను పంపిస్తే ఆ పార్సెలు తిరిగి వచ్చింది! ఎందుకు? ఏమయింది వసు? ఆ వూరు విడిచి వెళ్ళిందా? ఎక్కడుంది? ఎట్లా వుంది?

ఎక్కడవున్నా వసు వసూగానే వుంటుంది నిజంగా వసుంధరే ఆ అమ్మాయి! ఎన్ని కష్టాలో ఆ జీవితంలో ఎంత ఓర్పో ఆ మనిషిలో— తను అలాంటి మనిషి నింకొకరిని చూడలేదు. లలిత వుందా, ఒక నిముషం అతి ఉత్సాహంతో ఉరకలేస్తుంది. మరుక్షణం సరదాకేదయినా అన్నా సరే విపరీతంగా బాధపడి అలిగిపోతుంది. వసు అలా కాదు. నిరంతరం నవ్వుతూ– ఎప్పుడూ ఇంకొకరి సుఖంమే కోరుతూ– ఇంకొకరి సుఖంలోనే తన్ను తాను మరిచిపోగల అపురూపమయిన మనిషి!

ఇప్పటికీ తనకు గుర్తుంది నాలుగో తరగతి చదివేటప్పుడు ఒక సాయంకాలం తనూ, శాస్త్రి, అనంతలక్ష్మి, మంగమ్మ, వసూ— అందరూ బొమ్మలతో ఆడుకుంటున్నారు. బొమ్మలలో ఒకటి— ఒక కాలు విరిగినది— ఎంత సరిగా నిల్చోబెట్టినా కింద పడిపోయేది. తనకు చిరాకేసి ఆ బొమ్మను ఆటలో కొద్దని విసిరి పారేశాడు. అదివెళ్ళి జిల్లేడు మొక్కల పక్కగా పడింది. శాస్త్రివాళ్ళందరూ చప్పట్లు కొట్టారు. కాని వసుంధరకు మాత్రం కళ్ళ నీళ్ళొచ్చినంత పనయింది. "ఒరేయ్, దాన్నెందుకురా అలా విసిరావు–" అని వెళ్ళి ఆ బొమ్మను ఎంతో లాలింపుతో తీసుకుని దాన్ని పావడతో తుడిచి, ఒళ్ళో పడుకో పెట్టుకుని ఆ కాలువిరిగిన బొమ్మకు ఎన్ని కబుర్లు చెప్పిందో, ఎంత బుజ్జగించిందో...ఆ తర్వాత ఎపుడు వసూని ఆటకు పిలిచినా ఆ కాలు విరిగిన బొమ్మను ఆటలోకి తీసుకుంటేనే—తాను వస్తాననేది

అది వసుంధర హృదయం. అది నవనీతం. తనే గనక యూరపు పోక పోతేనా—ఆదీపం తన ఇంట్లో వెలగ వలసింది! జీవితం ఎంత విచిత్ర మయినదో— ఆమెను— ఆ వసూను చూచి పన్నెండేళ్ళయింది! చూసి పన్నెండు ఏళ్ళు.

— అనుకుంటున్న రమణని వెంకటేశ్వర్లు ఎనిమిదో సారిగా పిలిచాడు— "అయ్యా – ఫోనొచ్చిందండి...డాక్టరమ్మగారు పిలుస్తున్నారు—" అన్నాడు వెంకటేశ్వర్లు.

డాక్టరుతో అయిదు నిమిషాలు మాట్లాడాడు రమణ ఫోను క్రిందపెట్టేసరికి వీధిలో కారు చప్పుడయింది.

లలిత వచ్చింది. మెట్లెక్కి బోతుండగా "లలితా! అక్కడేవుండు వస్తున్నా....నువ్వివాళనుండి క్రిందే పడుకోవాలి లలితా!" అంటూ మెట్లుదిగాడు రమణ.

అతడి కళ్ళల్లోని ఆందోళన ఆమెకోవిధమయిన ఆనందానిచ్చింది. డాక్టరింటికి తోడు వచ్చిన తన అమ్మవైపు గర్వంగా చూచింది. లలిత.

అతడి మనసులో ఆలోచనెల్లా—"రక్తపు పోటు ఎక్కువనే సూచన వుందిట. లలితను కాపాడుకోవాలి!" అన్నదే.

◆ 0 ◆

"వసూ!"

రేణిగుంట జంక్షన్‌లో— అంత జనసందోహంలోనూ వసుంధర చెవులను తొలకరి వానగా తాకింది ఆ పిలుపు. ...పరుగెత్తి పోదామనుకుంది.

కాని వచ్చి చెయ్యి పట్టుకున్నాడు రమణ.
పధ్నాలుగు సంవత్సరాల తర్వాత—
జీవితంలో చాలదూరం గడిచాక—
కలుసుకున్నారు ఇద్దరూ.

ఆమె నుదురు ఖాళీగా వుండడం రమణ మనసుకు ఈటె పోటయింది

అతడి చూపుని తెలుసుకున్న వసుంధర తల వంచుకుంది. రమణ బొంబాయిమెయిల్లో గుంతకల్లు వెళ్తున్న వాడెల్లా తన సూట్‌కేసుని తీసుకున్నాడు రైలుపెట్టిలో నుండి. చేత సంచితో ఆమె నడిచింది. మొదటి తరగతి ప్రయాణీకుల విశ్రాంతి గదికి దారి తీశాడు రమణ. ఆమె ఎదుట కుర్చీలో కూర్చున్నాడు రమణ.

పైన దీపంచుట్టూ రెక్కల పురుగు లేవో తిరుగుతున్నాయి.

నీలిఅంచు తెల్లచీర, నల్లరవిక— చెవుల దగ్గర కొద్దిగా నెరిసిన జుత్తు— నగలు బొత్తిగాలేవు— అదే, నవ్వుమొహం ... కానిఈ నవ్వులో...అనుభవం వుంది...

"చెప్పు వసూ, చెప్పు! అన్నీ చెప్పు—"

నెమ్మదిగా, పర్వతాల ఒడి దుడుకులను దాటి సమతలానికి వచ్చిన నదిలా— చెప్పింది వసుంధర. అన్నీ చెప్పింది...

...రెండేళ్ళకింద ఆయన పోయినతర్వాత ఉమతో— తానా గ్రామంవిడిచి పెట్టింది.

మంగళంపల్లి ఎలిమెంటరీ బడిలో టీచర్‌గా చేరింది నాలుగు నెలలు జీతం సరిగావచ్చింది. తర్వాత వరసగా మూడునెలలు జీతం రాలేదు. ఒక సాయంకాలం ఆటలాడడానికి వెళ్ళిన ఉమ వర్షంలో తడిసి ముద్దయి వచ్చింది. ఆ రాత్రివచ్చిన జ్వరం రెండు రోజులలో న్యుమోనియాగా మారింది. బిడ్డకు మందుకని బకాయి జీతం ఇమ్మని, కాకపోతే కొంతడబ్బు అప్పుగా నయినా ఇమ్మనీ బ్రతిమాలితే ఆ బడి మేనేజరు...తనమీద చెయ్యి వేశాడు.

"ఆ!" అని పళ్ళు కొరికాడు రమణ. ఆ విశ్రాంతిగదిలో ఇంకోప్రక్క పడకకుర్చీలో తూగుతున్న త్యాగరాజశెట్టిగారు ఉలిక్కి పడి, కుడిచేతిమీద రైల్వే వల్లిని నలిపేసి మళ్ళీ నిద్ర పోయారు.

"ఉమకూడా వెళ్ళి పోయింతర్వాత — ఇంకా తనెందుకో అర్థం కావడంలేదు—"

అన్న వసుంధర రెండు చేతులూ పట్టుకుని చెప్పాడు రమణ. "వసూ! అట్లా ఎన్నటికీ అనకు వసూ."

చేతులు విడిపించుకుని లేచి ప్లాట్ ఫారం మీదికి వెళ్లింది వసుంధర.

రమణ కూడా వెళ్లాడు.

బొంబాయి మెయిల్ వెళ్లిపోయింది. ప్రయాణీకులూ, బిచ్చగాళ్లూ, పోర్టర్లూ అడ్డదిడ్డంగా ప్లాట్ ఫారమ్మీదే పడుకుని నిద్రపోతున్నారు. అర్థరాత్రి అయినా టీ దుకాణం వేడి వేడిగా సాగుతూంది.

"వసూ!"

నడుస్తున్న మనిషల్లా ఆగింది.

"నువ్వు నాతో వచ్చేయి వసూ!"

అవతలి ప్లాట్ ఫారమ్మీద ఏదో ఇంజను అరిచింది బొావురుమని.

వసుంధర మళ్లీ అడుగులు వెయ్య సాగింది. రమణ ఏమీ మాట్లాడలేదు.

"వద్దు రమణా వద్దు... నేను దేనికీ తగను. నువ్వన్నా హాయిగా వుండు లలితతో—"

"వసూ! లలిత చోటులేకే నిన్ను గమ్మని అడుగుతున్నాను—"

"ఆ?"... వసుంధర నడక ఆగింది.

పెద్దగా చప్పుడు చేసుకుంటూ గూడ్సు బండొకటి వాళ్లని దాటివెళ్లింది.

"అవును వసూ! లలితలేదు. ఆరునెలలయింది. అందుచేత అడుగుతున్నాను."

తల అడ్డంగా వూపింది వసుంధర.

"రమణా!" అంది. అతడు ఆమె మొహాన్నే చూస్తున్నాడు. ఏదో చెప్పబోయింది. ఎన్నో చెప్పాలనవుంది. కాని ఏమీ చెప్పలేదు

తలవూపుతూ మళ్లీ అడుగులు వెయ్యసాగింది ప్లాట్ ఫారం ఇంకా వుంది. కాని పైన రేకుల గొడుగు ఆగిపోయింది

"నా అమ్మాయి అరుణకు ఆరునెలలు నిండి చాలం కాలేదు. దానికి అమ్మ కావాలి వసూ!" గిరుక్కున ప్రక్కకు తిరిగిచూచింది వసుంధర.

"అవును వసూ, అవును—"

వసుంధర నవ్వింది.

అతడామె చేతిని తీసుకున్నాడు.

వసుంధర వెళ్లి ఆకాశం క్రింద నిల్చింది— రమణతో— అమ్మ ప్రేమలా ఆవరించివుంది ఆకాశం.

నల్లటిపిల్ల నవ్వినట్లుగా వున్నాయి నక్షత్రాలు.

## ప్రేమ కానుకలు

(17 వ పేజి తరువాయి)

ఎవరయినా తన మొహం చూస్తారేమో అని సిగ్గుగా ఉంది. తలొంచుకు నడుస్తున్నాడు.

ఛ ఛ! అనుభవం ఎంత చేదైనది! అనుభవాల్ని వాటి స్మృతుల కోసం ప్రేమించాలి, అంతే. అప్పుడే చాలవీధులు దాటేడు. ఇహ ఫర్వాలేదు. పేంటు జేబు తడుముకున్నాడు. భద్రంగా ఉన్న పెన్ను అతనిలోకి ఆ కుర్రాడిపై జాలిని పంపింది.

పాపం. ఆఖరుసారి అడిగిన పావలా అయినా ఇవ్వవలసింది. అందాకా ఎందుకు? పెన్ను అంత చవకలో అమ్ముకుంటున్న అతని వైపు సానుభూతి నిండిన ఒక్క చూపయినా బరపలేదే?

అయినా తనుమాత్రం ఏం చెయ్యగలడు?

ఆ కుర్రాడి మొహంలో అవసరానికి అమ్ముకుంటున్న వాడి దైన్యానికి బదులు, భయం తొంగి చూస్తున్న కొంటెనవ్వు కనబడుతూ ఉంటే తన కతనిమీద జాలెలా పుడుతుంది?

ఏమో. తన ఊహలు తప్పు కాకూడదూ? అతనొక పేదవిద్యార్థి. ఎవరో దాతనాశ్రయించి కలం కొనుక్కున్నాడు ఇప్పుడు తల్లికో చెల్లికో జబ్బు పెన్ను అమ్మి మందు కొంటే గాని వాళ్లు బతికే దారిలేదు.........ఇలా ఊహించుకుంటే తనుచేసిన పాపానికి నిష్కృతి ఉంటుందా?

గదికొచ్చేడు. గుర్తుగా పెట్టుకున్న అగ్గిపెట్టె తడుముకుని తీసి ఆత్రతగా దీపం వెలిగించేడు. పెన్నుతీసి చూశాడు. రాసిచూశాడు ముచ్చటైన పెన్ను.

ఇదే ఎవరైనా ప్రెజెంట్ చేసి వుంటే వాళ్లని జీవితాంతం జ్ఞాపకం పెట్టుకునే వాడే తను.

నిట్టూర్చి కేప్ పెడుతున్నాడు సత్యం. అది పట్టడంలేదు. తీసి కేప్‌లోకి చూశాడు దీపం దగ్గిర. ఓ కాగితం అడ్డుతోంది.

చీపురు పుల్లతో దాన్ని బయటికి తీశాడు

సన్నంగా మడతపెట్టి వుంది

సోమరి కుతూహలంతో దాన్ని విప్పేడు.

ఆశ్చర్యపోయేడు. దానిలో ఉన్నవి రెండుముక్కలు.

'ఎన్నాళ్ళబట్టో కోరిక. మనగుండెలకి దగ్గిరగా— మీ జేబులోనూ, నా జాకెట్టుకీ— ఉన్న వోస్తువులని ఒకరికొకరు కానుకలుగా ఇచ్చుకుని, మన ప్రస్తుత దూరాన్ని కొంత మాయం చెయ్యాలని.

'ఆషాఢ మేఘంలా ఆ వున్న ఆ కుర్రాడెవరో పోల్చుకున్నారా ఇప్పటికయినా?'

ఇదీ తను 'అన్ ఇమేజినేటివ్ వర్కింగ్ గర్ల్' గా భావిస్తున్న పార్వతి రాసిన లేఖ.

పెన్నుని ముద్దు పెట్టుకుని పెదవులు సిరా చేసుకున్నాడు సత్యం—ప్రేయసి కళ్లని ముద్దిడుకొని కాటుక చేసుకునే పూర్వ నాయకుల్ని అనుకరిస్తూ.

—

చదవండి — చందాదారులుగా చేరండి.

ఆంధ్రుల అభిమాన పక్షపత్రిక

చుక్కాని

సాలు చందా 4-50 విడిప్రతి 20 నయాపైసలు

